# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 05 జూన్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 317

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## జూలై21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు




2లో

## 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కల సేకరణ

అప్పుడే కులగణన కూడా జరిగే అవకాశం

కేంద్ర అధికార వర్గాల వెల్లడి



2లో

## ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

హత్యచేసి పడేసినట్లు పోలీసుల గుర్తింపు



## ఆర్సీబీ విజయోత్సవాల్లో

# తొక్కిసలాట

## 11 మంది దుర్మరణం..

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్లో నెగ్గి- కలల కప్‌ను సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయోత్సవాల ఘట్టంలో పెను విషాదం చోటుచేసుకుంది. బెంగళూరు నగరంలో బుధవారం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి అభిమానులు భారీ ఎత్తున చేరుకోవటంతో తొక్కిసలాట జరిగింది.**

| |
|---|
| 50 మందికి పైగా గాయాలు |
| ఆర్‌సీబీ కప్పు గెలవడంతో |
| అభిమానుల్లో కట్టలు తెగిన ఉత్సాహం |
| బెంగళూరులో చిన్నస్వామి స్టేడియం |
| వద్దకు లక్షలమంది అభిమానులు |
| తీవ్ర తొక్కిసలాట.. నియంత్రించలేకపోయిన పోలీసులు |
| మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం |
| న్యాయవిచారణకు ఆదేశించిన సిద్ధరామయ్య సర్కారు |



బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్లో నెగ్గి- కలల కప్‌ను సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయోత్సవాల ఘట్టంలో పెను విషాదం చోటుచేసుకుంది. బెంగళూరు నగరంలో బుధవారం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి అభిమానులు భారీ ఎత్తున చేరుకోవటంతో తొక్కిసలాట జరిగింది. 11 మంది దుర్మరణం చెందగా.. 50 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. అహ్మదాబాద్‌లో మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి 'ఈ సల కప్ నమ్‌దే' (ఈసారి కప్ మనదే) నినాదాన్ని సాకారం చేసుకున్న ఆర్‌సీబీ జట్టు బుధవారం మధ్యాహ్నం 2.45 గంటలకు హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి

మిగతా 2లో



2లో

## పహల్గామ్ దాడితో కేంద్రం అప్రమత్తం

అమర్‌నాథ్ యాత్రకు భారీగా భద్రత



2లో

## టెట్ 2025 పరీక్షల షెడ్యూల్ విడుదల

18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్

# నీళ్లిచ్చిన కేసీఆర్‌కు నోటీసులిస్తారా?

- ఆయనకు రక్షణ కవచంలా నిలుస్తాం
- కమిషన్ మీద నమ్మకం ఉంది... దాన్ని వేసిన ప్రభుత్వంపైనే అనుమానం
- ఇందిరా పార్కు వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత
- రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు
- కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



రాజకీయ దురుద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నీళ్లిచ్చిన కేసీఆర్‌కు నోటీసు ఇవ్వడం సిగ్గుచేటని... ఆయనకు తామంతా రక్షణ కవచంలా నిలుస్తామని పేర్కొన్నారు.

2లో



2లో

## పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ

- వేములవాడ కోడెల మృతి దారుణం
- ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో 2024 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో శిక్షణ పొందుతున్న ఐఏఎస్‌లు సౌరభ్ శర్మ, సలోని చాబ్రా, హర్ష చౌదరి, కరోలిన్ చింగ్తియన్ మవాయి, కె.ప్రణయ్ కుమార్ తదితరులు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్-ఛైర్‌పర్సన్ శాంతికుమారి ఆధ్వర్యంలో సీఎంని కలిశారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. బాధ్యతల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ఇంటెలిజన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, కోర్సు డైరెక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఎక్కడా మార్పు కనిపించడం లేదు



**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా.. ఆ పార్టీ నేతలు తెస్తామన్న మార్పు ఎక్కడా కనిపించడం లేదని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.**

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా.. ఆ పార్టీ నేతలు తెస్తామన్న మార్పు ఎక్కడా కనిపించడం లేదని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఈ ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా అమలుచేయాలనే దానికంటే.. ఎలా అమలుచేయకూడదో అన్న అంశంపైనే లోతైన కసరత్తు చేసింది. రైతుభరోసా కింద రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో నగదు జమ చేయలేదు. 65 శాతం రైతులకే రుణమాఫీ అయింది. మిగిలిన వారికి మొండిచెయ్యి చూపారు.

రైతు కూలీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారీగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, నిధుల విడుదలపై ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో స్పష్టత ఇవ్వాలి" అని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

వేగుచుక్క

## జూలై21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకూ జరుగుతాయి. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజూ బుధవారం విలేకరులకు తెలిపారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ– ఈ తేదీలను సిఫార్సు చేసిందని,ఈ మేరకు సమావేశాలను ఖరారు చేశామని ఆయన వివరించారు. ఆపరేషన్ సిందూర్ ఇతర వీషయాలను చర్చించేందుకు వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సెషన్ ఏర్పాటు– జరగాలని ప్రతిపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఈ దశలోనే విపక్షాల డిమాండ్ గురించి ఏమి చెప్పకుండా ప్రభుత్వం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను వెల్లడించింది. మరి ప్రతిపక్షాల డిమాండ్ గురించి ఏం చెపుతారు?

అని విలేకరులు ప్రశ్నించగా , అన్ని విషయాలను పార్లమెంటరీ నిబంధనల మేరకు వర్షాకాల సమావేశాల్లోనే చర్చించవచ్చునని మంత్రి జవాబు ఇచ్చారు.

## పహల్గామ్ దాడితో కేంద్రం అప్రమత్తం

**అమర్‌నాథ్ యాత్రకు భారీగా భద్రత**

న్యూఢిల్లీ:జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో 26 మంది మరణించిన నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానున్న అమర్‌నాథ్ యాత్రకు కేంద్రం కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని నిర్ణయించింది. ఈ యాత్రకు ముందు ఉగ్రదాడి జరిగే అవకాశముందని కేంద్రం భావిస్తుంది. అలాంటి తరుణంలో అమర్‌నాథ్ యాత్రికుల భద్రత కోసం ఆపరేషన్ శివను కేంద్రం చేపట్టనుంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా అమరనాథ్ యాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు ఈ యాత్రికులకు పటిష్టమైన భద్రత కల్పించనున్నారు. ఈ అమర్‌నాథ్ యాత్ర సమయంలో ఆ మార్గంలో హై అలర్ట్ కొనసాగించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ఉన్నతాధికారులను స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో యాత్రా నివాస్ నుంచి ఈ యాత్ర కొనసాగే ప్రాంతమంతా అత్యంత భద్రతను ఏర్పాటు– చేయనున్నారు. దీంతో ఉన్నతాధికారులు, పోలీస్, పారా మిలటరీ ఉన్నతాధికారులు ఇప్పటికే ఈ మార్గంలో భద్రత చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు లెప్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఈ యాత్ర భద్రతపై ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. ఈ మార్గంలో, బేస్ క్యాంపులు, సున్నితమైన ప్రాంతాలలో దాదాపు 50 వేల మందికిపైగా సైనికులను మోహరించనున్నారు. అలాగే డ్రోన్లు, హెలికాప్టర్లతో నిరంతర నిఘా కొనసాగించనున్నారు. మూడంచెల భద్రతను ఏర్పాటు– చేస్తున్నారు. ఇక ఈ మార్గం మొత్తం సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. యాత్రికుల భద్రతే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారు. అమరనాథ్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో భద్రతా బలగాలు ఇప్పటికే 3డీ మ్యాపింగ్ నిర్వహించాయి. గుహలోకి వెళ్లే భక్తులు.. తిరిగి బయటకు వచ్చే మార్గాల వద్ద భద్రతను మదింపు చేస్తున్నారు. ఈ యాత్రలో యాత్రికుల భద్రత కోసం దాదాపు 50 కంపెనీలకు చెందిన పారా మిలటరీ బలగాలను రంగంలోకి దింపనున్నారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభమై.. ఆగస్ట్ 9వ తేదీతో ముగియనుంది. జులై 3వ తేదీన తొలి బ్యాచ్ యాత్రికులు శ్రీనగర్ నుంచి బస్సుల్లో ఈ యాత్రకు బయలుదేరి వెళ్లనున్నారు. హిమాలయాల్లో దాదాపు 3880 మీటర్ల ఎత్తులోని అమర్‌నాథ్ గుహలో శివుడిని దర్శించుకునేందుకు ఇప్పటికే వేలాది మంది భక్తులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న సంగతి తెలిసిందే.

## టెట్ 2025 పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ 2025 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ) పద్ధతిలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉ.9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లు– డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఈసారి –టె–ట్‌కు 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి ఎగ్జామ్ షెడ్యూల్ కోసం టెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ

సిద్దిపేట: కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్

ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది

ఆస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు– చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.



# ఆర్సీబీ విజయోత్సవాల్లో తొక్కిసలాట

చేరుకుంది. అక్కడ ఆటగాళ్లకు ఘన స్వాగతం లభించింది. కర్ణాటక ప్రభుత్వం విధానసౌధ ప్రాంగణంలో క్రికెటర్లను సన్మానించాలని నిర్ణయించడంతో జట్టు సభ్యులు బస్సుల్లో సాయంత్రం 4.30 గంటలకు విధానసౌధలో అడుగుపెట్టారు.. అక్కడ గవర్నర్ తావర్‌చంద్ గహ్లోత్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. పావుగంటలోనే కార్యక్రమం ముగిసింది. తర్వాత చిన్నస్వామి స్టేడియంలో జట్టును సన్మానించడానికి కర్ణాటక క్రికెట్ సమాఖ్య సన్నాహాలు చేసింది. విధాన సౌధ నుంచి ఆ స్టేడియం కేవలం అర కిలోమీటరు దూరంలోనే ఉంటుంది. అక్కడ సాయంత్రం 6 గంటలకు విజయోత్సవాలు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే అప్పటికే ఆ ప్రాంతానికి భారీ ఎత్తున అభిమానులు చేరుకున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత బెంగళూరు జట్టు ఐపీఎల్ కప్‌ను సొంతం చేసుకోవడంతో క్రికెట్ అభిమానులతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. అంచనాకు మించి జనం రావడంతో నియంత్రించడం పోలీసుల వల్ల కాలేదు. స్టేడియం సామర్థ్యం 35 వేల మంది మాత్రమే. కానీ మూడు లక్షల మందికి పైగా అభిమానులు తోసుకొచ్చారు. అదే సమయంలో వర్షం కురవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో వెనుక గేటు వద్ద తొక్కిసలాట మొదలై పలువురు మృత్యువాతపడ్డారు. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లోనే సాయంత్రం 6.10 గంటల సమయంలో క్రికెట్ జట్టు స్టేడియంలోకి ప్రవేశించగా, 6.30 గంటలకల్లా విజయోత్సవ కార్యక్రమం ముగిసింది.

**బెంగళూరులో విధానసౌధ వద్ద ఇసుక వేస్తే రాలనంతగా చేరిన క్రికెట్ అభిమానులు**

**ఐదుగురి పరిస్థితి విషమం**

తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందగా, మరో 50 మందికి పైగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. వారికి ఐసీయూల్లో చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలంలోనే ముగ్గురు చనిపోగా, ఆస్పత్రుల్లో చేర్చేలోగా ముగ్గురు, చికిత్స సమయంలో ఐదుగురు మరణించారు. ఈ దుర్ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన ఓ బాలుడిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు


**మృతుల కుటుంబాలకు పరిహారం..**

విజయోత్సవ వేళ ఈ దుర్ఘటన దురదృష్టకరమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అంచనాకు మించి అభిమానులు చేరుకోవడంతో నియంత్రణ సాధ్యపడలేదని వెల్లడించారు. ఈ అనూహ్య ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారి చికిత్స వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. గాయాలపాలైన వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారని వివరించారు. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు తొక్కిసలాటకు సర్కారు వైఫల్యమే కారణమని విపక్షాలు ఆరోపించాయి. హెచ్‌ఏఎల్ నుంచి విధానసౌధ వరకు విజయోత్సవ ర్యాలీకి అనుమతి ఇచ్చి ఉంటే లక్షలమంది ఒకేచోట చేరుకోవాల్సిన అవసరం ఉండేది కాదని విపక్ష నేత ఆర్.అశోక్ వ్యాఖ్యానించారు.

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట కారణంగా గాయపడిన అభిమానిని ఆస్పత్రికి తరలిస్తూ..







**ఏపీ గవర్నర్, సీఎం విచారం**

ఈనాడు, అమరావతి: బెంగళూరు చినస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ జట్టు సన్మాన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతి చెందడంపై ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**దురదృష్టకర ఘటన: కిషన్‌రెడ్డి**

ఈనాడు, హైదరాబాద్: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఇది దురదృష్టకర ఘటన అని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు పూర్తిగా కర్ణాటక ప్రభుత్వం, ఆ రాష్ట్ర పోలీసుల వైఫల్యమే కారణమని ఆరోపించారు. బెంగళూరులో తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన సంతాపం ప్రకటించారు.

**మృతుల్లో ఎక్కువ మంది 20 ఏళ్లలోపు వారే**

సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కప్‌ను అందుకున్న అభిమాన క్రీడాకారులను చూడాలన్న ఆశలు ఆవిరయ్యాయి. ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం కాస్తా తొక్కిసలాట కారణంగా చిన్నస్వామి స్టేడియం బాధితుల రోదనలతో నిండిపోయింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా వారిలో తొమ్మిదిమంది వయసు 20 ఏళ్లలోపే. ఆస్పత్రుల్లో చేరిన వారి సంఖ్య అధికారికంగా 35కు పైగా ఉండగా చిన్నపాటి గాయాలతో ఇంటికి చేరిన వారు, ఇతర ఆస్పత్రుల్లో చేరినవారి సంఖ్య 400కు పైగా ఉంటుందని అంచనా. **మొత్తం మృతులు: 11 పురుషులు: 6మహిళలు: 5 దివ్యాంశి (13), దివ్య (26), శ్రవణ్ (17), భూమిక (20), సహన (19), చిన్మయి (19) పూర్ణ చంద్ర (35) శరత్ (17)గుర్తు తెలియని మృతులు: 20 ఏళ్ల యువకుడు, 19 ఏళ్ల యువకుడు, మరో పదహారేళ్ల యువకుడు.**

# నీళ్లిచ్చిన కేసీఆర్‌కు నోటీసులిస్తారా?

**హైదరాబాద్:** రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని..మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. తెలంగాణ భూములకు నీళ్ల ఇవ్వడం కేసీఆర్ చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జ ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీ–ఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీ–ఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి – పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. ఎనిమిది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదన్నారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. గోదావరి నీటిలో వెయ్యి టీ–ఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.



మంచిర్యాల, రామగుండం ప్రాంతంలో ధర్నాకు వస్తున్న జాగృతి

కార్యకర్తలను అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎందుకు ఇంత భయపడుతున్నది? ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమన్నారు. హైదరాబాద్‌లో ధర్నా చేయనివ్వకపోతే జిల్లాల్లో, గల్లీల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ప్రాంగణం మంగళవారం ఉదయం ఉద్రిక్త వాతావరణాన్ని చూసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జారీ చేసిన నోటీ–సులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.

## ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

మేడ్చల్:మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు– చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

ెలవులు ఇచ్చారు. తిరిగి 2025–26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

## 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కల సేకరణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెరపడను ంది. జనగణనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం సన్నద్ధమవుతోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కులగణన కూడా నిర్వహించ నున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు– కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు.

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ పక్రియ చేపట్టాల్సింది.

వేగుచుక్క

# వృద్ధుడనే కనికరం లేకుండా ఏఎస్ఐ దాష్టీకం..



నిర్మల్: ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామపంచా యతీ పరిధిలో షాకింగ్ సంగటన ఒకటి వెలుగు చూసింది. భూభారతి సదస్సులో భాగంగా.. ఎమ్మార్వో ఆఫీసులో తన భూమి సమస్య విన్నవించుకోవడం కోసం వెళ్లిన ఓ వృద్ధ రైతుపై ఏఎస్ఐ జాలి దయ లేకుండా ప్రవర్తించాడు. వృద్ధుడనే కనికరం లేకుండా రైతు చేయి పట్టుకుని బయటకు లాక్కెళ్లాడు. రైతు అల్లేపు వెంకటి తన భూమి సమస్య గురించి ఎమ్మార్వోతో మాట్లాడుతుంటే అటుగా వచ్చిన ఏఎస్ఐ.. ఏమాత్రం కనికరం లేకుండా వృద్ధ రైతును ఈడ్చుకెళ్లి బయటకు నెట్టేశాడు. ఈ ఘటనపై పోలీస్ శాఖ సీరియస్ అయ్యింది. ఇప్పటికే ఏఎస్ఐ రాంచందర్‌ను సస్పెండ్ చేశారు. కాగా ఈ ఘటనపై రైతు స్పందించారు. తన భూమి సమస్యను పరిష్కరించుకోవడం కోసం ఎమ్మార్వో ఆఫీసుకి వెళ్లి.. అధికారులతో మాట్లాడుతున్న సమయంలో తనను పోలీస్ గుంజుకొని వెళ్లి బయట పడేశాడని చెప్పాడు. తన వయసు 90ఏళ్లు.. తన పట్ల ఇంత ఘోరంగా ప్రవర్తించడం అవసరమా అని ఆవేదన వ్యక్తం చేశాడు. అసలు తానేం చేయలేదని ఎమ్మార్వోతో మాట్లాడి వెనక్కి వస్తుంటే పోలీస్ తనను గట్టిగా పట్టుకుని లాగాడని చెప్పుకొచ్చాడు. సదరు పోలీసు అధికారి మీద తనకు విపరీతమైన కోపం వచ్చిందని.. కట్టెతో ఒక్కటి వేద్దామని అనుకున్నానని కానీ అక్కడ ఉన్నవాళ్లంతా వారించడంతో ఆగిపోయానని చెప్పుకొచ్చాడు. తన భూమిలో నుండి అర ఎకరం భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నారని చెప్పారు. ఎమ్మార్వో ఆఫీసులో అధికారులు ఏం అనలేదని.. కేవలం పోలీసులు మాత్రమే బయటకు పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వార్తలపై జిల్లా ఇంఛార్జ్ మంత్రి సీతక్క స్పందించారు. వృద్ధ రైతు పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఏఎస్ఐని సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ చర్యలు తీసుకున్నారు.

# ఆ ఊరి బొడ్రాయి వద్ద.. గ్రామస్తులంతా అక్కడికే..

తెలంగాణ: కాకతీయుల చరిత్రకు సాక్ష్యంగా.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని అనాసాగరంలో కొత్త శాసనం బయటపడింది. ఇది కాకతీయ గణపతిదేవుని కాలం నాటి రేచర్ల రెడ్డిరాజుల దానశాసనం. కట్టా శ్రీనివాస్ గుర్తించి.. తెలుగు లిపిలో ఉన్న ఈ శాసనాన్ని చదివారు. దీనిపై శివలింగం, సూర్యచంద్ర చిహ్నాలు ఉన్నాయి. నాలుగు అడుగుల పొడవున్న ఈ రాతిబండ ఆనాటి పాలన, దానధర్మాలు, సామాజిక జీవనంపై విలువైన సమాచారం అందిస్తుందన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

తెలంగాణ చరిత్రలో కాకతీయుల ప్రాధాన్యత ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వారి శాసనాలు కేవలం వరంగల్ జిల్లాలోనే కాకుండా.. ఖమ్మం వంటి ఇతర ప్రాంతాల్లోనూ లభ్యమయ్యాయి. ఈ ఆధారాలు కాకతీయ సామ్రాజ్యం తెలంగాణ అంతటా విస్తరించిందని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రాంతం కాకతీయుల పాలనకు సంబంధించిన అనేక శాసనాలకు నిలయంగా ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు పురావస్తు ఆధారాలు బయల్పడ్డాయి. తాజాగా.. నేలకొండపల్లి సమీపంలోని అనాసాగరంలో మరో కొత్త కాకతీయ శాసనం వెలుగులోకి వచ్చింది. ఇది ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను మరింత పెంచింది.

**అనాసాగరంలో అద్భుత ఆవిష్కరణ..**

ఖమ్మం జిల్లా.. నేలకొండపల్లి మండలంలోని అనాసాగరంలో, పాతబొడ్రాయి ఏరియాలోని రావిచెట్టు సెంటర్‌లో కాకతీయ కాలం నాటి శాసనం కనుగొనబడింది. ఇది నేలకొండపల్లి చరిత్రకు ఒక అద్భుతమైన కలికితురాయిగా నిలుస్తోంది. నాలుగు అడుగుల పొడవు, అడుగు మందంతో ఉన్న నాలుగు ముఖాల నల్లరాతి బండపై ఈ శాసనం చెక్కబడింది. ఒకవైపున 19 పంక్తుల్లో, తెలుగు లిపిలో, తెలుగు భాషలో చెక్కబడిన ఈ అరుదైన శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ కట్టా శ్రీనివాస్ గుర్తించి చదివారు.

శాసనంపై శివలింగం.. దానికి ఇరువైపులా సూర్యచంద్రుల చిహ్నాలు చెక్కబడి ఉన్నాయి. ఇది ఆనాటి మతపరమైన ఆచారాలు, ఖగోళ విశ్వాసాలను తెలియజేస్తుంది. ఈ శాసనం కాకతీయ గణపతిదేవుని కాలం నాటి రేచర్ల రెడ్డిరాజుల దానశాసనంగా గుర్తించబడింది. దేవాలయాలు కాలగమనంలో కనుమరుగు అయినా.. ఈ దానశాసనం మాత్రం చెక్కుచెదరక మిగిలింది. ఇది అనాసాగరం గ్రామంతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కాకతీయుల పరిపాలన, వారి దానధర్మాలు, ఆనాటి సామాజిక-ఆర్థిక పరిస్థితులపై మరింత లోతైన అవగాహనను అందిస్తుంది.

నేలకొండపల్లి చరిత్ర పూర్వం నుండి ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఇక్కడ బౌద్ధ మత అవశేషాలు, శాతవాహనుల కాలం నాటి నిర్మాణాలు, పలు దేవాలయాల శిథిలాలు లభ్యం అయ్యాయి. కాకతీయుల కాలానికి చెందిన అనేక శాసనాలు కూడా ఇక్కడ బయల్పడ్డాయి. ఈ ప్రాంతం ఒకప్పుడు ప్రముఖ వాణిజ్య కేంద్రంగా, మతపరమైన కూడలిగా విలసిల్లింది. గతంలో లభ్యమైన శాసనాలు కాకతీయుల పాలనా విధానాలు.. పరిపాలనలో నేలకొండపల్లి ప్రాధాన్యత.. ఆనాటి సామాజిక జీవనంపై విలువైన సమాచారాన్ని అందించాయి. కొత్తగా దొరికిన ఈ శాసనం.. ఆనాటి రాజులు ప్రజల శ్రేయస్సు కోసం చేసిన దానధర్మాలను, ముఖ్యంగా దేవాలయాలకు, భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

ఈ ఆవిష్కరణ పట్ల స్థానిక గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. వందలాది ఏళ్ల నుంచి తమ గ్రామం ఉనికిలో ఉన్నదని, ఈ శాసనం తమ గ్రామం ప్రాచీనతకు నిదర్శనమని వారు తెలిపారు. ఈ శాసనాన్ని చూడటానికి స్థానికులతో పాటు, చరిత్ర పరిశోధకులు, పురావస్తు శాస్త్రవేత్తలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. ఇలాంటి శాసనాలు చరిత్రకు నిశ్శబ్ద సాక్ష్యాలుగా నిలుస్తాయి, గత వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేస్తాయి. పురావస్తు శాఖ ఈ శాసనాన్ని పరిరక్షించి, మరింత పరిశోధన జరపడంద్వారా తెలంగాణ చరిత్రకు మరిన్ని విలువైన విషయాలు వెలుగులోకి వస్తాయి.

# మోదీ హయాంలో దేశం అభివృద్ధి.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త.




వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 4:

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం "వికసిత్ భారత్ అమృత కాలం" పేరిట కేంద్ర బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల సేవా సూపరిపాలన, పేదల సంక్షేమం అంశాలపై బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అద్యక్షతన కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమం, పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధి – ఇవే మా లక్ష్యాలని తెలిపారు. ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, హర ఘర్ జల్, స్వచ్ఛ భారత్, జనధన్ యోజన వంటి పథకాలు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని అన్నారు. ప్రతిపక్షాలు ప్రస్తుతం ఆపరేషన్ సిందూరు వంటి అంశాల ద్వారా ప్రధాని మోదీ పై అభాసుపాల చేయాలనే కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు.దేశ భద్రత విషయంలో బీజేపీ ప్రభుత్వ పట్టుదలని తప్పుబట్టే ప్రయత్నం విఫలమవుతుందన్నారు. కార్యకర్తలంతా ఈ కుయుక్తులపై ప్రజల్లో నిజాన్ని చెప్పాలి, అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇది ప్రతి కార్యకర్త బాధ్యతని అన్నారు. ఈ రోజు పార్టీ కోసం కష్టపడితే, రేపు మీరు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీగా గెలిచే అవకాశముంటుందని తెలిపారు. గెలుపు మనదే కావాలంటే ప్రతి బూత్ స్థాయిలో కష్టపడాలన్నారు. ప్రతి ఓటును బీజేపీకి రప్పించాలని, ఇది పార్టీని బలోపేతం చేయడమే కాదు, దేశాన్ని బలోపేతం చేయడమూ" అని అన్నారు. ఈ కార్యశాలలో కార్యక్రమా కన్వీనర్ పోతనకర్ లక్ష్మి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, కో కన్వీనర్ రామచందర్, కలిగొట గంగాధర్, రూరల్ కన్వీనర్ పద్మ రెడ్డి, జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్, సుధాకర్ చారి, కార్పొరేటర్ మాస్టర్ శంకర్, మండల అధ్యక్షులు ఇప్పకాయల కిషోర్, ఆనంద్ రావు, జిల్లా, మండల, కోదూరు నాగరాజ్,బూత్ స్థాయి నాయకులు, యువ మోర్చా, మహిళా మోర్చా కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సేవే లక్ష్యంగా "లయన్స్" ముందుకు సాగాలి.

## - లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా అదనపు క్యాబినెట్ ట్రెజరర్ పి.లక్ష్మినారాయణ.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 4:



సేవే లక్ష్యంగా లయన్స్ ప్రతినిధులు ముందుకు సాగాలని లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా అదనపు క్యాబినెట్ ట్రెజరర్ పి. లక్ష్మినారాయణ ఉద్బోధించారు. బుదవారం నగరంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్ లో లయన్స్ క్లబ్ ల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా అదనపు క్యాబినెట్ ట్రెజరర్ పి. లక్ష్మినారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయా క్లబ్ ల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారితో పాటు ఇతర కార్యవర్గం అంకితభావంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రొటీన్ కార్యక్రమాలకు భిన్నంగా ప్రజలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. లయనిజంలో కొత్త సభ్యులను చేర్చడంతో పాటు నూతన క్లబ్ ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్యభగవాన్, రీజియన్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జోన్ చైర్మెన్లు నరసింహరావు, భూమన్న, అవన్, పీఆర్వో చింతల గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో ఎగ్ బిర్యానీ..



తెలంగాణ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇకపై పిల్లలకు వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఎగ్ బిర్యానీ వడ్డించనున్నారు. అంతేకాకుండా, గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వనుండగా, బడి గంట తరహాలో బెల్స్ విధానం ప్రవేశపెట్టనున్నారు. త్వరలోనే 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే వారిని బ్లాక్ లిస్టులో పెడతామని ఆమె హెచ్చరించారు.

తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. ఇకపై అంగన్వాడీల్లో వారానికి ఒకటి, రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూలో మార్పులు చేయబోతన్నట్లు ప్రకటించారు. అలానే అంగన్వాడీల ద్వారా చిన్నారులకు అందిస్తున్న ఆహారపదార్థాలను మరింత రుచికరంగా మారుస్తామని తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివద్ధి సంస్థలో బుధవారం నాడు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమధన సదస్సులో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై చర్చించడమే కాక కీలక ప్రకటనలు చేశారు. ఆ వివరాలు..

చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. వారికి అంగన్వాడీల ద్వారా అందిస్తున్న విద్య, ఆరోగ్య భద్రత అంశాలను మెరుగుపరుచుకునే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. అలానే అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు కింద కూర్చోవాలంటే.. ఇబ్బందిపడుతున్నారని తాము గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. ఈసమస్యలను తొలగించేందుకు.. త్వరలోనే అంగన్వాడీకేంద్రాలకు బెంచీలను సరఫరా చేస్తామని ప్రకటించారు. అలానే ప్రస్తుతం అంగన్వాడీ టీచర్లు వాడుతున్న మొబైల్ ఫోన్ల స్థానంలో అధునాతనమైన వాటిని అందజేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అలానే బడిగంట తరహాలోనే.. అంగన్వాడీ కేంద్రాల్లో కూడా బెల్స్ విధానం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. గంట మోగించడం ద్వారా చిన్నారుల్లో బాల్యం నుంచే క్రమశిక్షణ, ఉత్సాహం, పెరుగుతాయని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల మీద పని ఒత్తిడి తగ్గించేందుకు త్వరలోనే 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. ప్రైవేటే ప్లే స్కూల్స్‌కి దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. అలానే అంగన్వాడీల్లో చిన్నారుల చదువు, ఆటవిడుపు, సౌకర్యం కోసం మొత్తం 57 రకాల వస్తువులను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. అంగన్వాడీల్లో అడ్మిషన్లు పెంచేందుకు అమ్మమాట.. అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. అలానే అంగన్వాడీ కేంద్రాలకు నాసిరకం సరుకులు సరఫరా చేసే వారిని బ్లాక్ లిస్టులో పెడుతున్నామని హెచ్చరించారు. అలానే అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అయ్యే కోడిగుడ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఇక తెలంగాణ ప్రభుత్వం చిన్నారులు, మహిళలు, బాలికలు, యువతుల ఆరోగ్యం, వికాసం కోసం అనేక రకాల కార్యక్రమాలను అమలు చేస్తుంది. కొన్నిరోజుల క్రితమే రక్తహీనత సమస్య పరిష్కారం కోసం ఇందిరమ్మ అమృతం పథకంలో భాగంగా 14-18 ఏళ్ల యువతులకు అంగన్వాడీల ద్వారా నెలకు 30 చిక్కీలను ఇవ్వాలని నిర్ణయించింది. ముందుగా పైలెట్ ప్రాజెక్ట్ కింద కొన్ని ప్రాంతాల్లో మాత్రమే దీన్ని అమలు చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్రం అంతా విస్తరిస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు.

# అల్లంవెల్లుల్లి పేస్ట తింటే డైరెక్ట్‌గా కోమాలోకే..

హైదరాబాద్: కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కలకలం రేపింది. పాతబస్తీలో బండ్లగూడలో ఓ ముఠా కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తూ పట్టుబడింది. ఎఫ్‌కే ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో మహమ్మద్ ఫైసల్ అనే వ్యక్తి టైటానియమ్ డైఆక్సైడ్, పసుపుపొడి కలిపి కల్తీ పేస్ట్ తయారు చేస్తున్నాడు. దీనిని వాడితే కిడ్నీలు పాడై కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. పోలీసులు 870 కిలోల కల్తీ పేస్ట్‌ను సీజ్ చేశారు.

నేటి కాలంలో ఏం తినాలన్నా భయపడే పరిస్థితుల్లో ఉన్నాం. కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా రెచ్చిపోతున్నారు కొందరు కేటుగాళ్లు. తాగే నీటి నుంచి ఖరీదైన సుగంధ ద్రవ్యాల వరకు ప్రతి దాన్ని కల్తీ చేసి.. జనాల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. ఒకప్పుడంటే.. తినే ప్రతి దాన్ని స్వయంగా ఇంట్లోనే తయారు చేసుకునే వారు. పంటలకు కూడా పెద్దగా రసాయనాలు వాడే వారు కాదు. దీంతో అప్పుడు కల్తీలు, రసాయనాల బెడద పెద్దగా లేదు. కానీ నేటి కాలంలో.. మనం తినే తిండిలో ఏది కల్తీనో.. ఏది మంచిదో తెలుసుకోవడం చాలా కష్టం అవుతుంది.ఇక కల్తీరాయుళ్ల పని పట్టడానికి ఫుడ్ సెఫ్టీ అధికారులు నిత్యం తనిఖీలు చేస్తున్నప్పటికీ వీరు మాత్రం మారడం లేదు. తాజాగా హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్



బయట పడింది. దీన్ని తింటే కిడ్నీ సమస్యలే కాక.. డైరెక్ట్‌గా కోమాలోకి వెళ్లే అవకాశం ఉందంటున్నారు అధికారులు. ఆ వివరాలు..

తాజాగా పాతబస్తీ బండ్లగూడలో పోలీసులు తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ప్రాంతంలోని కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి చేసి.. భారీ పరిమాణంలో నిల్వ ఉంచిన కల్తీ అల్లంవెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేశారు. సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తాజాగా.. పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహమ్మద్ ఫైసల్ అనే వ్యక్తి ఇంట్లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించారు. ఇతడుఎఫ్‌కే ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో హానికరమైన రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టును ప్రజలకు విక్రయిస్తున్న ట్లు అధికారులు గుర్తించారు.

ఈ కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ కోసం మహమ్మద్ ఫైల్.. టైటానియమ్ డైఆక్సైడ్, పసుపుపొడిని వినియోగిస్తున్నాడని అధికారులు తెలిపారు. ఈ రెండింటిని కలిపి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నాడు. మహమ్మద్ తయారు చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్.. భారత ప్రభుత్వం సూచించిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్‌ని పాటించడం లేదని అధికారులు గుర్తించారు.

టైటానియమ్ డైఆక్సైడ్‌తో తయారు చేసిన ఈ అల్లంవెల్లుల్లి పేస్ట్ వినియోగిస్తే.. కిడ్నీలు పాడవుతాయని.. చివరకు కోమాలోకి వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇక ఈ దాడుల్లో 870 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, 4 కిలోల టైటానియమ్ డైఆక్సైడ్, 4 కిలోల పసుపుపొడి, 16 కిలోగ్రాముల మోనో సైట్రేట్‌ను స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఇలాంటి కల్తీ ఆహారం పట్ల జనాలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో వీరికి మాత్రమే..!

తెలంగాణ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని ప్రకటించారు. గుడిసెవాసులకు మొదటి విడతలో ఇళ్లు ఇచ్చామని.. అర్హులైన మిగిలిన వారికి రెండో విడతలో ఇస్తామని.. ఇది ప్రతి సంవత్సరం ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఖమ్మంలో మంజూరు పత్రాలు పంపిణీ చేస్తూ.. గత పాలకులను విమర్శించారు. రూ.22,500 కోట్లు ఈ పథకానికి కేటాయించినట్లు, 20 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యమని చెప్పారు. రైతు రుణమాఫీ, బోనస్, పెట్టుబడి సాయం వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు.

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇది కేవలం ఒక తాత్కాలిక కార్యక్రమం కాదని.. నిరంతర ప్రక్రియ అని ఆయన స్పష్టం చేశారు. ఈ సంవత్సరం ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న పేదలందరికీ మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేశామని.. వీరిలో కూడా ఇంకా అందరికీ ఇవ్వలేదని.. త్వరలోనే వారికి కూడా మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. ఇక దరఖాస్తు చేసుకొని అర్హులైన మిగిలిన లబ్ధిదారులెవరూ నిరాశ చెందవద్దని, ప్రతి సంవత్సరం ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. వచ్చే ఏడాది రెండవ విడతలో భాగంగా వారికి కూడా అవకాశాలు లభిస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు.

ఖమ్మం జిల్లాలోని టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో.. ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి మంత్రి పొంగులేటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా.. లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూసి తాను భావోద్వేగానికి లోనయ్యానని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు నిజంగా ఉపయోగపడే పనులు చేస్తే వారి నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుందని ఆయన అన్నారు. గత పాలకుల విధానాలపై విమర్శలు గుప్పించిన మంత్రి.. వారు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాలపై చూపిన శ్రద్ధను పేద ప్రజల ఇళ్లపై పెట్టలేదని.. వారి సొంతింటి కలను విస్మరించారని ఆరోపించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని తమ అజెండాగా చేసుకుందని.. ఈ సంవత్సరం పేద ప్రజల సొంతింటి కల కోసం రూ.22 వేల 500 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ.. పేదల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు కావాలని, ఎక్కడ కూడా లంచాలకు ఆస్కారం ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకే ఈ పథకాన్ని అమలు చేస్తు న్నామని ఆయన అన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి ప్రకటించారు.

ప్రభుత్వం పేదల ఇళ్లతో పాటు రైతు సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి గుర్తు చేశారు. రైతుల కోసం దాదాపు రూ.21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు రూ.500 రూపాయల బోనస్ అందించామని వివరించారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయాన్ని ఎకరానికి రూ.12 వేల రూపాయలకు పెంచామని, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని అన్నారు. ప్రస్తుతం ఏదులాపురం మున్సిపాలిటీలో 520 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు.. దశలవారీగా అందజేస్తామని మంత్రి తెలిపారు.

# కోర్టు చెప్పినా డోంట్ కేర్..



'థగ్ లైఫ్' చిత్రం విడుదల వేళ.. తమిళ భాష నుండి కన్నడ పుట్టిందన్న కమల్ హాసన్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు తీవ్రంగా స్పందించాయి. సారీ చెప్పాలని, లేదంటే ఆయన సినిమాని బ్యాన్ చేస్తామని కర్ణాటక ఫిలిం ఛాంబర్ హెచ్చరించింది. అయితే క్షమాపణ చెప్పేందుకు నిరాకరించిన కమల్.. అపార్థాలకు క్షమాపణలు ఉండవని తేల్చి చెప్పారు. కర్ణాటక హైకోర్టు తన కామెంట్స్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో.. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్‌కు కమల్ ఓ లేఖ రాశారు. సీనియర్ నటుడు కమల్ హాసన్ నటించిన లేటెస్ట్ మూవీ 'థగ్ లైఫ్'. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. జూన్ 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఇప్పుడు కన్నడ వివాదం కారణంగా కర్ణాటకలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయకూడదని కమల్ హాసన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'థగ్ లైఫ్' ఈవెంట్ లో తమిళ భాష నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను కన్నడ సంఘాలు, అధికార విపక్ష పార్టీలతో పాటు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే కమల్ సినిమాని కర్ణాటకలో బ్యాన్ చేస్తామని కేఫ్‌సీసీ హెచ్చరించింది. దీనిపై కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టుని ఆశ్రయించారు. మంగళవారం ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. కమల్ పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. ఈ పరిణామాల నేపథ్యంలో 'థగ్ లైఫ్' చిత్రాన్ని కర్ణాటకలో రిలీజ్ చేయనని కమల్ ప్రకటించారు.

"ప్రస్తుతానికి కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమాను విడుదల చేయడం లేదు. తప్పులకు మాత్రమే క్షమాపణలు చెబుతారు, అపార్థాలకు కాదు" అని కమల్ హాసన్ కీలక వ్యాఖ్యలు చేసారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా సినిమా రిలీజ్ అయ్యేలా చూడాలంటూ కోర్టులో వేసిన పిటిషన్ ను కూడా కమల్ ఉపసంహరించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తదుపరి విచారణను హైకోర్ట్ జూన్ 10కి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. మరోవైపు కమల్ హాసన్ తాజాగా కర్ణాటక ఫిలిం ఛాంబర్ కు లేఖ రాశారు. కన్నడ భాషపై తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, తన ప్రకటన కారణంగా శివ రాజ్ కుమార్ కుటుంబం ఇబ్బంది కలిగించిందని పేర్కొన్నారు.

"కర్ణాటక ప్రజల పట్ల ఉన్న అపారమైన గౌరవంతో, నేను నిజాయితీగా ఈ లేఖ రాస్తున్నాను. 'థగ్ లైఫ్' ఆడియో లాంచ్ సందర్భంగా నేను చేసిన ప్రకటన కారణంగా డాక్టర్ రాజ్ కుమార్ ఫ్యామిలీని, ముఖ్యంగా శివ రాజ్ కుమార్ ని తప్పుగా అర్థం చేసుకోవడం నాకు బాధ కలిగించింది. మనమందరం ఒకే కుటుంబానికి చెందిన వారమని చెప్పాలనే అలా అన్నానే తప్ప, కన్నడ భాషను ఏ విధంగానూ తక్కువ చేయాలనేది నా మాటల ఉద్దేశ్యం కాదు. కన్నడ భాష యొక్క గొప్ప వారసత్వంపై ఎటువంటి వివాదం లేదు.. చర్చా లేదు" అని కమల్ హాసన్ రాసుకొచ్చారు.



# ది రాజా సాబ్ రిలీజ్ డేట్ ఫిక్స్..

ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో వస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ది రాజాసాబ్' నుంచి మాస్ అప్‌డేట్ వచ్చేసింది. జూన్ 16 ఉదయం 10:52 గంటలకు టీజర్ రిలీజ్ చేస్తామని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ప్రభాస్ ఈ అప్‌డేట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అభిమానులను ఖుషీ చేశాడు. అలాగే వరల్డ్‌వైడ్‌గా ఈ మూవీని డిసెంబర్ 5న విడుదల చేస్తామని కూడా ప్రకటించారు. ఓ భారీ పోస్టర్‌తో పాటు విడుదల తేదీ వెల్లడించడంతో ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మారుతి కాంబోలో తెరకెక్కుతోన్న 'ది రాజా సాబ్' మూవీకి సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ప్రభాస్ కెరీర్లోనే తొలిసారి రొమాంటిక్ హారర్ జోనర్లో వస్తోన్న ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న రెబల్ ఫ్యాన్స్‌కి కరువు తీర్చేశారు మేకర్స్. 'ది రాజా సాబ్'కి సంబంధించి టీజర్ అప్‌డేట్‌తో పాటు రిలీజ్ డేట్‌ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఈ మేరకు పోస్టర్‌ని రిలీజ్ చేశారు. 'ది రాజా సాబ్' మూవీ టీజర్‌ని జూన్ 16వ తేదీ ఉదయం 10 గంటల 52 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. అలాగే రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ అప్‌డేట్‌లో ప్రభాస్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. తెలుగు సినీ ఇండస్ట్రీలో డిసెంబర్ ఐదో తేదీకి ఓ ప్రత్యేకత ఉంది. అల్లు అర్జున్ , సుకుమార్ కాంబినేషన్లో వచ్చిన 'పుష్ప 2' 2024, డిసెంబర్ 5న విడుదలై ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే.

# సీఎం చంద్రబాబుకి ఆహ్వానం



టాలీవుడ్ హీరో అక్కినేని అఖిల్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన తండ్రి నాగార్జున మంగళవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని కలసి పెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. పారిశ్రామికవేత్త జుల్ఫీ రవ్డ్జీ కుమార్తె జైనబ్‌ని అఖిల్ ఈ నెల 6న వివాహం చేసుకోనున్నాడు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వివాహ వేడుక జరగనుండగా, రిసెప్షన్ రాజస్థాన్‌లో గ్రాండ్‌గా ప్లాన్ చేశారు. ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో టాలీవుడ్ అగ్ర హీరో అక్కినేని నాగార్జున మంగళవారం భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన నాగార్జున చంద్రబాబును కలిశారు. తన చిన్న కుమారుడు అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి పెళ్లికి తప్పకుండా రావాలని ఆహ్వానించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన జుల్ఫీ రవ్డ్జీ కుమార్తె జైనబ్‌తో అఖిల్ నిశ్చితార్థం గతేడాది నవంబర్ 26న జరిగిన సంగతి తెలిసిందే. వీరిద్దరు కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఈ జంట వివాహం ఈ నెల ఆరో తేదీన జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే నాగార్జున దంపతులు తమ కుమారుడి వివాహానికి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. పెళ్లి అన్నపూర్ణ స్టుడియోలో జరగనుండగా.. రిసెప్షన్ రాజస్థాన్‌లో గ్రాండ్‌గా ప్లాన్ చేశారట. అక్కినేని నాగార్జున పెద్ద కుమారుడైన నాగచైతన్యకి హీరోయిన్ శోభితతో వివాహం జరగ్గా... ఇప్పుడు చిన్న కుమారుడు అఖిల్ పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ వివాహానికి సినీ ఇండస్ట్రీలకు చెందిన సెలబ్రెటీలతో పాటు రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి. అఖిల్‌కి గతంలో వ్యాపార దిగ్గజం జీవీ కృష్ణారెడ్డి మనవరాలు శ్రేయా భూపాల్‌తో నిశ్చితార్థం జరగ్గా.. మనస్పర్థల కారణంగా క్యాన్సిల్ చేసుకున్నారు. కొన్నాళ్లుగా జైనబ్‌తో ప్రేమాయణం నడుపుతున్న అఖిల్ ఇప్పుడు ఆమెతో పెళ్లి పీటలెక్కుతున్నాడు. అయితే అఖిల్ కంటే జైనబ్ వయసు తొమ్మిదేళ్లు ఎక్కువని తెలుస్తోంది.

# యంగ్ హీరోతో లవ్ స్టోరీ





'హిట్ 3'తో ఇటీవలే మంచి హిట్టు కొట్టి ఊపుమీదున్నాడు శైలేష్ కొలను. సినిమా అంతా రక్తపాతంతో నింపేశాడని విమర్శలు వచ్చినా 'హిట్ 3' బాక్సాఫీస్ వద్ద బాగానే వసూళ్లు రాబట్టింది. వరుసగా యాక్షన్ థ్రిల్లర్లు, ఇన్వెస్టిగేషన్ డ్రామాలు తీయడంతో విసుగెత్తిన శైలేష్ ఈసారి జోనర్ మారుస్తానని.. వెంకటేష్‌తో కామెడీ ఎంటర్‌టైనర్ తీస్తానని ఓ ఇంటర్వ్యూలో చెప్పిన సంగతి తెలిసిందే. శైలేష్ తాజాగా ఓ యంగ్ హీరోతో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ హీరో శ్రీకాంత్ వారసుడిగా... దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో వచ్చిన 'పెళ్లిసందతో హీరోగా పరిచయమయ్యాడు మేక రోషన్. ఆ సినిమా తర్వాత కాస్త విరామం తీసుకున్న రోషన్ ఇప్పుడు వరుసగా సినిమాలు లైన్లో పెడుతున్నాడు.

ప్రస్తుతం మలయాళంలో స్టార్ హీరో మోహన్‌లాల్ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోన్న రోషన్.. తెలుగులోనూ ఓ ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్, ఆయన కుమార్తె స్వప్న దత్ సంయుక్త నిర్మాణంలో 'ఛాంపియన్' అనే సినిమా చేస్తున్నాడు. తాజాగా ప్రముఖ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో ఓ మూవీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రేమకథగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని శైలేష్ కొలను డైరెక్ట్ చేయనున్నాడట. ఈ ప్రాజెక్ట్కు త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.

శైలేష్ డైరెక్షన్లో వచ్చిన చిత్రాల్లో హింస ఎంత ఎక్కువగా ఉంటుందో అందరికీ తెలిసిందే. అలాగే హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ సన్నివేశాలు కూడా అంతే రొమాంటిక్‌గా తీస్తాడు ఈ డైరెక్టర్. 'హిట్ 3'లో హింసాత్మక సన్నివేశాలు శ్రుతిమించినా.. హీరో నాని, హీరోయిన్ శ్రీనిధి శెట్టి మధ్య రొమాంటిక్ సన్నివేశాలు కూడా అంతే స్థాయిలో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు రోషన్‌తో తెరకెక్కే ప్రేమకథని కూడా అదే రేంజులో తీయనున్నాడని టాక్. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. రోషన్ నటిస్తోన్న 'ఛాంపియన్' చిత్రం స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతోం ది. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తికాగా.. మిగతా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రోషన్, శ్రీలీల ఒకేసారి తెలుగు తెరకు పరిచయం కాగా.. శ్రీలీల మాత్రం జెట్ స్పీడుతో దూసుకుపోతోంది. మరోవైపు ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న రోషన్ ఇప్పుడు స్పీడ్ పెంచాడు.

# 'ఓజీ' రైట్స్‌కి కళ్లుచెదిరే ధర!



పవన్ కళ్యాణ్, సుజీత్ కాంబినేషన్‌లో వస్తోన్న 'ఓజీ' మూవీపై అంచనాలు భారీగా ఉన్నాయి. సెప్టెంబర్ 25న దసరా కానుకగా రిలీజ్ కానున్న ఈ చిత్రం నైజాంలో థియేట్రికల్ రైట్స్ ఏకంగా రూ.90 కోట్లు దాటనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే పవన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ రికార్డ్ అవుతుంది. రూ.250 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో బాలీవుడ్ విలన్ ఇమ్రాన్ హష్మీ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం పవన్ చేతిలో 'హరిహర వీరమల్లు', 'ఓజీ', 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలు ఉండటంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు.

రన్ రాజా రన్, సాహో చిత్రాలతో ఇండస్ట్రీని ఆకర్షించిన సుజిత్ డైరెక్షన్లో పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తీస్తోన్న ఈ మూవీని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య దీన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించి పవన్ ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌కు అదిరిపోయే రెస్పాన్స్ రావడంతో అంచనాలు తారాస్థాయికి చేరాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇటీవలే అధికారికంగా ప్రకటించారు.

ఈ చిత్రంపై నెలకొన్న అంచనాలతో థియేట్రికల్ బిజినెస్ అద్భుతంగా జరుగుతోందట. సినీ పరిశ్రమకు కీలకమైన నైజాంలో ఓజీ హక్కుల కోసం భారీ పోటీ నెలకొందట. ఇక్కడ ఏకంగా రూ.90 కోట్ల వరకు బిజినెస్ జరుగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇది నిజమో కాదో తెలియదు గాని నిజమైతే మాత్రం నైజాంలో బిగ్గెస్ట్ రికార్డ్ అనే చెప్పాలి. ఇంత మొత్తంలో ధర ఇచ్చేందుకైనా అగ్ర నిర్మాతలు ఉత్సాహంగా ఉన్నారట. 'ఓజీ'లో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తుండగా, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాశ్ రాజ్, హరీశ్ ఉత్తమన్, అభిమన్యు సింగ్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ఓజీ' బడ్జెట్ రూ.250 కోట్లు కాగా.. పవన్ రెమ్యునరేషన్‌కే రూ.100 కోట్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

పవన్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా ఈ నెల 12న రిలీజ్ కానుంది.'ఓజీ' మూవీ దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అఫిషియల్‌గా ప్రకటించారు. మరోవైపు హరీష్ శంకర్ డైరెక్షన్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ జూన్ రెండో వారం నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు నిర్మాతలు తెలిపారు. రాజకీయాలతో బిజీగా ఉన్నప్పటికీ మూడు సినిమాలు లైన్లో పెట్టడం పవన్ కళ్యాణ్ కెరీర్లో ఇదే తొలిసారి కావడం విశేషం. నైజాంలో ఇప్పటివరకు రాజమౌళి దర్శకత్వంలో రాంచరణ్, ఎన్టీఆర్ మల్టీస్టారర్‌గా వచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకి రూ.70 కోట్లు, కల్కి సినిమాకి రూ.65 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు ఇండస్ట్రీ వర్గాల టాక్. ఇప్పుడు 'ఓజీ' వాటిని దాటేసి నంబర్ ప్లేస్‌లోకి నిలవడం విశేషం.



# మీకు అవసరమా...

తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సినిమాకు ప్రమోషన్ వీడియో చేయడం వల్ల విమర్శలు ఎదుర్కొంటున్న నయనతార ధీటుగా స్పందించింది. "ప్రమోషన్‌కి వెళ్లాలా? వద్దా? అన్నది నా పర్సనల్ విషయం. దీంట్లో ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు" అంటూ ట్రోలర్లకు బదులిచ్చింది. చిరంజీవి-అనిల్ రావిపూడి సినిమాలో రూ.18 కోట్లు తీసుకుంటోందని టాక్. తమిళ సినిమాల ప్రమోషన్లకు రావని నయన్ తెలుగు సినిమాకి ముందే ప్రమోషన్ చేయడం ఎలా అని కొందరు నెటిజన్లు ప్రశ్నించగా, ఆమె స్వయంగా స్పందించింది.

ప్రస్తుతం లేడీ సూపర్‌స్టార్ నయనతార క్రేజ్ మామూలుగా లేదు. ప్రస్తుతం అరడజనుకు పైగా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఆమె సీనియర్, జూనియర్ హీరోలు అన్న తేడా లేకుండా అందరితోనూ నటిస్తోంది. చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్లో తెరకెక్కుతోన్న మూవీలో నటించేందుకు ఏకంగా రూ.18 కోట్లు తీసుకుంటున్నట్లు టాక్. అయితే నయనతారతో ప్రాజెక్ట్ గురించి చర్చించేందుకు చెన్నై వెళ్లిన అనిల్ రావిపూడితో ఆమెతో ఓకే చేయించి వెంటనే ప్రమోషన్ వీడియో కూడా చేయించేశాడు. కొన్నాళ్లుగా ఏ మూవీ ప్రమోషన్స్‌కి రాని నయనతారని అలా ఒప్పించినందుకు ఆయనపై సినీ ప్రముఖులతో పాటు నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

రూ.100 కోట్లు ఇచ్చినా ఆ హీరోతో నటించను... ౧అయితే ఇంతవరకు బాగానే ఉన్నా నయనతారపై కోలీవుడ్ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. తమిళ సినిమాల ప్రమోషన్లలో ఏనాడూ పాల్గొనని నువ్వు తెలుగు సినిమాకి అదీ షూటింగ్ మొదలు కాకముందే ఎలా ప్రమోషన్ చేస్తావ్.. తెలుగు సినిమాలపై అంత మమకారం ఉంటే టాలీవుడ్‌కే షిఫ్ట్ అయిపో అంటూ నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. అయితే ఈ ట్రోలింగ్‌కి నయనతార ధీటుగా స్పందించింది. అనవసర విషయాలకి టైమ్ వేస్ట్ చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నా వీలును బట్టి నిర్మాతలకు సహకరిస్తూనే ఉంటా. ప్రమోషన్లకి వెళ్లాలా?.. వద్దా.. అన్నది నా పర్సనల్ విషయం. దీంట్లో ఒకరికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు' అని తనదైన స్టైల్‌లో రిప్లయ్ ఇచ్చింది లేడీ సూపర్‌స్టార్.

నయనతార ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సుమారు 10 సినిమాల్లో నటిస్తోంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో గతంలో రెండు సినిమాలు చేయగా.. అనిల్ రావిపూడి డైరెక్షన్లో మూడోసారి నటిస్తోంది. మరోవైపు ఆమెకు శరవణన్ హీరోగా తెరకెక్కుతోన్న రెండో సినిమాలో ఆఫర్ వచ్చిందట. ఇందుకోసం ఆమెకు ఎంత పారితోషికమైనా ఇచ్చేందుకు ఆయన టీమ్ సిద్ధమైందట.

అయితే తనకు రూ.100 కోట్లిచ్చినా సరే ఆయనతో నటించనని తెగేసి చెప్పేసిందట. ఇది నిజమో కాదో తెలీదు గాని కోలీవుడ్‌లో మాత్రం వార్త తెగ వైరల్ అవుతోంది. అలాగే తమిళం, కన్నడం, మలయాళ భాషల్లోనూ నయనతార క్రేజ్ మామూలుగా లేదు. ఈ సినిమాలన్నీ ఓవైపు షూటింగ్ కంప్లీట్ చేసుకుంటుండగానే కొత్త ప్రాజెక్టులను లైన్లో పెడుతోంది. మొత్తానికి సినిమాలతోనే కాదు తనపై విమర్శలు చేసే ట్రోలర్స్‌కి ధీటైన సమాధానంతోనూ నయనతార వార్తల్లో నిలుస్తోంది.

## తీన్మార్ మల్లన్న

# వివాదాస్పద వ్యాఖ్యలు

"రాజేంద్ర ప్రసాద్ బూతులు తిడుతున్నప్పుడు అలీ అక్కడే ఉండి నవ్వుతున్నాడు. వాడ్ని ఒక తన్ను తన్నాల్సింది. వాడొక సిగ్గులేని వెదవ. నువ్వు అసలు మనిషివేనారా రాజేంద్రప్రసాద్. ఫాల్తు నా కొలికా. నిన్ను ఎవరైనా ఆ మాట అంటే ఊరుకుంటావా? నీ ఫాల్తు మొహంలో చెప్పు. సిగ్గు శరం ఉండాలి. అలీ తల్లిని లంలి అన్నందుకు క్షమాపణలు చెప్పాలి. దొంగ నా కొలికా.. సినిమా వాళ్ళు అనగానే మీరేమన్నా అదవుతారా?. ఏ ఊర్రా నీది?. మా వర్గాల ప్రజల గురించి తప్పుగా మాట్లాడితే ఇట్లే మాట్లాడాల్సి వస్తుంది. నువ్వు మా మైనారిటీ బీసీ వర్గాలకు దొరికితే, నిన్ను తన్నకపోతే అడుగు. వేస్ట్ నా కొలికా" అంటూ తీన్మార్ మల్లన్న షాకింగ్ కామెంట్స్ చేసారు. ( నేను ఇలానే సరదాగా ఉంటా.. తప్పుగా అర్థం చేసుకుంటే మీ కర్మ.. ఆలీ కాంట్రవర్సీపై రాజేంద్ర ప్రసాద్ ) రాజేంద్రప్రసాద్ పై తీన్మార్ మల్లన్న మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడింది తప్పైతే, మల్లన్న మాట్లాడింది ఏంటని కౌంటర్ ఇస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ అంతకంటే తీవ్ర అసభ్యకరమైన కామెంట్స్ చేసారంటూ మల్లన్నను విమర్శిస్తున్నారు. గతంలో పలు సందర్భాల్లో మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. రాజేంద్రప్రసాద్ ఉద్దేశ్యపూర్వకంగా తనపై కామెంట్స్ చేయలేదని అలీ స్వయంగా క్లారిటీ ఇచ్చారని.. వాళ్ళు వాళ్ళు బాగున్నప్పుడు మధ్యలో నీ బాధ ఏంటి? అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

గతంలో కూడా పలు సందర్భాల్లో రాజేంద్రప్రసాద్ నోరు జారడం, ఆ తర్వాత క్షమాపణ చెప్పడం తెలిసిందే. కానీ ఈసారి విమర్శలు వచ్చినా ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాను మాట్లాడే మాటలను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని.. అది వాళ్ళ ఖర్మ.. సంస్కారం మీద ఆధార పడి వుంటుందని అంటు న్నారు. తప్పుగా మాట్లాడడం వేరు, తప్పుగా అర్థం చేసుకోవడం వేరు అని నెటిజన్లు కౌంటర్ ఇస్తున్నారు. అలీ మాత్రంపెద్దాయన్ని వదిలేయండి అంటూ వీడియో పోస్ట్ చేసారు.